బాల సాహితీవేత్తలకు బహుమతులను అందజేసిన వక్తలు

## ఉత్తమ సమాజ నిర్మాణానికి సాహితీ సదస్సులు దోహదం

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 15: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆబిడ్స్ బొగ్గుల కుంట తిలక్ రోడ్డులో గల సారస్వత పరిషత్తు ప్రాంగణంలో గల ఆడిటోరియంలో శుక్రవారం కోడూరి శాంతమ్మ స్మారక బాలల సాంస్కృతి కోత్సవం ఘనంగా జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు వందకు పైగా పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు కథ, వచన కవిత, పద్య కవిత, చిత్రలేఖనం అంశాలలో పోటీలు పడి రచనలు పంపించగా, 7 5మందికి పైగా రూ. 500ల నగదు బహుమతులను, 85కు పైగా ప్రత్యేక ప్రశంస, జ్ఞాపిక, ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సాహిత్య, సాంస్కృతికోత్సవం సందర్భంగా వేదికపై పాటల పోటీలు, వక్తృత్వం, పుస్తక సమీక్షా రచన, ఏకపాత్రాభినయం, వ్యాసరచన తదితర అంశాలలో ప్రతిభా పాటవాలను చాటుకుని ఆహూతుల ప్రశంసలు, బహుమతులను అందుకున్నారు. అనంతరం పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో శాంతా–వసంత ట్రస్టు వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ కేవి వరప్రసాదరెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి పాల్గొని ఉత్తమ సమాజ నిర్మాణానికి సృజనాత్మక పెరగడానికి పోటీలు దోహదపడతాయన్నారు. సంగీతం కళ గురించి కలగా కృష్ణమోహన్, నాట్యకళ విశిష్టతపై డాక్టర్ విజయ్ కుమార్జీ ప్రసంగించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్‌తో పాటు పలువురు బాల సాహితీ వేత్తలు పాల్గొని విశ్లేషణాత్మక ప్రసంగాలు చేసి విద్యార్థులను ఆలోచింపజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

## మూసీ ప్రక్షాళనతో కాంగ్రెస్ పార్టీ భారీ స్కామ్

### రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి

మన్సూరాబాద్, నవంబర్ 15: మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ స్కామ్‌కు తెరలేపారని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి తెలిపారు. ఎల్బీనగర్, చంద్రపురి కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను తిప్పి కొడతామన్నారు. మూసీ సుందరీకరణ కోసం ఎలాంటి డీపీఆర్ సిద్ధం చేయకుండానే రూ.లక్ష యాభై వేల కోట్ల నిధులు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేద ప్రజల ఇండ్లను కూల్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు మద్దతుగా బీజేపీ ఉంటుందన్నారు. ప్రజలకు మద్దతుగా శనివారం రాత్రి మూసీ పరివాహక ప్రాంతంలోని 27 చోట్ల బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు బస చేస్తారన్నారు. తెలంగాణ ప్రజల సొమ్మును కొల్లగొట్టి ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల కోసం కాంగ్రెస్ అధిష్టానానికి డబ్బు మూటలు పంపేందుకే ముఖ్యమంత్రి మూసీ ప్రక్షాళన అంశాన్ని ముందుకు తీసుకువచ్చారన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు బీజేపీ మద్దతుగా నిలిచి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సునీతారెడ్డి, నాయకులు ఆలె పురేందర్ నేత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నేతలు

## ఉపాధ్యాయ ఫెడరేషన్ కోసం కృషి

కీసర, నవంబర్ 15: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీయూటీఎఫ్ అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఉప్పల్‌లోని విజయరత్న హై స్కూల్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పూర్వ అధ్యక్షులే జంగిటి కైలాసం అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో నల్గొండ, ఉమ్మడి రంగారెడ్డి, వరంగల్, హైదరాబాద్ జిల్లాలోని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల కార్యదర్శులు, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సంఘం నిర్మాణం పట్ల, ఇంకా అభివృద్ధి పై చర్చించి పలు అంశాలకు సంబంధించి ఏకగ్రీవ తీర్మాణం చేశారు. కార్యక్రమంలో పలు జిల్లాల నేతలు పాల్గొన్నారు.

# ప్రజలకు మాటలు.. కాంగ్రెస్‌కు మూటలు

### కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారింది

### మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చొద్దు

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజం

### నేడు అంబర్‌పేటలో మూసీ నిద్ర కార్యక్రమం

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 15(నమస్తే తెలంగాణ): మూసీ పరిసర ప్రాంతాల్లో ఒక్కరోజు నిద్రపోవాలన్న సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నామని, శనివారం 'మూసీ నిద్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన బేగంపేటలోని హరిత ప్లాజాలో నిర్వహించిన లోక్ మంథన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం, మీడియాతో మాట్లాడుతూ 'మూసీ ప్రక్షాళన చేయండి.. అంతే గానీ, పేదల ఇండ్లు కూల్చకండి' అనేదే తమ నినాదమన్నారు. మూడు నెలల పాటు నిద్ర చేయడానికి కూడా తాము సిద్ధమేనని తెలిపారు. పేదల ఇంట్లోనే భోజనం చేసి, పేదల ఇండ్లలోనే నిద్ర చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు, హామీలను అమలు చేయకుండా మహారాష్ట్రలో అబద్ధపు ప్రచారాలు చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ వంటి నేతలు యాత్రలు చేపట్టి అనేక రకాల హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ సరిగ్గా అమలు చేయలేదని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనలో 'మాటలు ప్రజలకు.. మూటలు కాంగ్రెస్ పార్టీకి' అన్నట్టుగా తయారైందని ఎద్దేవా చేశారు. రేవంత్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

#### అవి బీఆర్ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లు

బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వంలో నియామక పత్రాలు ఇచ్చి జబ్బలు చరుచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోలులో విఫలం అయ్యారని, రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి, 15 పైసలు కూడా ఇవ్వలేదని, రైతు కూలీలకు రూ.12 వేలు హామీ అమలు కాలేదని, బోనస్‌పై మాట మార్చారని, అరకొరగా రుణమాఫీ చేశారని విమర్శించారు. పోలీసు వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, వ్యాపార రంగం విశ్వాసం కోల్పోయిందని, పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏకైక ఏటీఎంగా మారిందని కిషన్ రెడ్డి ఆరోపించారు.

#### అంబర్‌పేటలో కిషన్ రెడ్డి నిద్ర

మంత్రి కిషన్‌రెడ్డి తులసీరామ్‌నగర్‌లో, ఎంపీ కె.లక్ష్మణ్ ఓల్డ్ మలక్‌పేటలోని శాలివాహన నగర్‌లో, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి గౌలిగూడలో, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రాజేంద్రనగర్‌లోని హైదర్ షా కోట్‌లో మూసీ నిద్ర చేయనున్నారు.

పురస్కారాలు అందుకున్న కేశవ్ మెమోరియల్ పాఠశాల ఉపాధ్యాయులు

## కేశవ్ మెమోరియల్‌కు జాతీయ పురస్కారాలు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 15: మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని అబిడ్స్ సమీపంలోని తెలంగాణ సారస్వత ప్రాంగణం – బొగ్గులకుంటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవ్ మెమోరియల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తనూజ పాండిచ్చేరి (ఆంగ్లం), తుమ్మలపల్లి పద్మజ (సాంఘిక శాస్త్రం), సత్తినారు నాగరత్నం (తెలుగు), ఎర్ర శాంతిలేశ్వరి (బయోలాజికల్ సైన్స్), బోయిన సుజాత (సాంఘిక శాస్త్రం), పాయల లక్ష్మీప్రియ (బయోలాజికల్ సైన్స్)లలో ప్రావీణ్యంతో విద్యాబోధన సాగిస్తున్నందుకు గాను జాతీయ పురస్కారాలను అందజేసి సత్కరించారు. మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, తమిళ నటులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## 30 నుంచి సీపీఎం గ్రేటర్ మహాసభలు

జూబ్లీహిల్స్, నవంబర్ 15: నవంబర్ 30, డిసెంబర్ 1వ తేదీలలో సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ 23వ మహాసభలు జూబ్లీహిల్స్ జోన్ శ్రీనివాసనగర్ (వెస్ట్) కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్నట్లు హైదరాబాద్ సీపీఎం పార్టీ సెంట్రల్ సిటీ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పార్టీ నగర సెక్రటేరియట్ సభ్యులు ఎం.వెంకటేశ్ వెల్లడించారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్‌పీఆర్ హిల్స్ సీపీఐ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పోరాటంలో సీపీఎం పార్టీ ఇతర పార్టీలకు దీటుగా ముందున్నదన్నారు. దేశంలో కార్మికుల, రైతుల, పేద ప్రజల పక్షాన పోరాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేస్తున్నదని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సీపీఎం పార్టీ ఆవశ్యకతను గుర్తించి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగనున్న సెంట్రల్ సిటీ కమిటీ 23వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ ఆర్.అశోక్, నాయకులు టి.సాయి శేషగిరిరావు, జూకటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ సిటీ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సెక్రటేరియట్ సభ్యులు వెంకటేశ్, అశోక్, సాయి శేషగిరి రావు, జి.స్వామి

## ఇంటింటికీ వెళ్లండి.. ఓటీఎస్‌పై అవగాహన పెంచండి

### సమావేశంలో జల మండలి ఎండీ

సిటీబ్యూరో, నవంబరు 15 (నమస్తే తెలంగాణ): జల మండలి అమలుచేస్తున్న వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)పై ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్‌లు డైరెక్టర్లు, సీజీఎం, జీఎంలతో జూమ్ మీటింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటీఎస్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి డివిజన్‌లో టాప్–10 వినియోగదారులు, ప్రభుత్వ కార్యాలయాలు అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేయాలని జీఎంలకు ఎండీ సూచించారు. ప్రతి మేనేజర్ ఇంటి ఇంటికీ వెళ్లి ఓటీఎస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి జల మండలి రెగ్యూలర్ మీటర్ రీడర్లకు, కలెక్షన్ గ్యాంగ్‌లతో కలిసి బిల్లులు వసూలు అయ్యేలా చూడాలన్నారు. న్యాయపరమైన దీర్ఘకాలికంగా బిల్లు చెల్లించకుండా ఉన్న వినియోగదారులను గుర్తించి వారి సమస్యను పరిష్కరించడానికి సీజీఎంలు చొరవ తీసుకోవాలని ఈడీ మయాంక్ మిట్టల్ పేర్కొన్నారు. సమావేశంలో జల మండలి ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్ –2 స్వామి, సీజీఎం, జీఎంలు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా మారుస్తాం

### మంత్రి జూపల్లి కృష్ణారావు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మాదాపూర్, నవంబర్ 15: తెలంగాణకు వచ్చే దేశ విదేశీయులను పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లడమే లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మాదాపూర్ – హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ట్రావెర్నియా టూరిజం కల్చర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు విచ్చేసి నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణకు వచ్చే దేశ, విదేశీయులు పర్యాటక సాంస్కృతిక వారసత్వ కట్టడాలు చారిత్రక ప్రాంతాలను సందర్శించే విధంగా టూరిజం ప్రమోషన్ కొరకు రాష్ట్ర ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా మార్చే దిశగా కార్యచరణ రూపొందిస్తున్నామని, ఇందుకు సంబంధించి త్వరలోనే నూతన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పర్యాటక వారసత్వ చారిత్రక ప్రాంతాలు ఆయా ప్రాంతాల ప్రజల జీవన శైలి, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సాంప్రదాయాలను గురించి సమగ్ర సమాచారాన్ని పర్యాటక ప్రియులకు తెలియజేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో యూఎన్ టూరిజం అంబాసిడర్ కార్ల్ జోషువా, ప్రముఖ చరిత్రకారుడు డా. సిన్హ్రాజా తమ్మిట, ట్రావెర్నియా ఫెస్ట్ వ్యవస్థాపకుడు డా. అంతోని విపిన్ దాస్, రావాణా పరిశ్రమ, ట్రావెల్ ఏజెన్సీ ప్రతినిధులు ఉన్నారు.

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన విశాల్ దివస్‌లో పాల్గొన్న సిక్కు సోదరులు

## ఘనంగా గురునానక్ జయంత్యుత్సవాలు

### విశాల్ దివస్‌లో వేలాదిగా పాల్గొన్న సిక్కు సోదరులు

సుల్తాన్ బజార్, నవంబర్ 15: గురునానక్ దేవ్ జీ 555వ జయంతి వేడుకలలో భాగంగా విశాల్ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అఫ్జల్‌గంజ్ గురుద్వారా గురుసింగ్ సభ అశోక్ బజార్, సింధ్రాబాద్ గురుద్వారా సాహెబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేలాది మంది సిక్కు సోదరులు, సోదరీమణులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ విశాల్ దివస్‌లో భాగంగా రాగి జాతాస్ (మత గురువులు)ల ప్రవచానాలతో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. కార్యక్రమంలో భాగంగా హెల్త్ క్యాంపు, రక్తదాన శిబిరంలో భక్తులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గురుద్వారా ప్రబంధక్ కమిటీ నిర్వాహకులు, జీఎస్ఎస్ అధ్యక్షులు ఎస్.బలదేవ్ సింగ్ బగ్గా, జీఎస్ జీఎస్ఎస్ అధ్యక్షులు ఎస్.సత్వీందర్ సింగ్ బగ్గా, ఉపాధ్యక్షుడు ఎస్.జైపాల్ సింగ్ తుతేజా, జీఎస్ఎస్ కార్యదర్శులు ఎస్.జగన్‌మోహన్ సింగ్, ఎస్.హర్‌ప్రీత్ సింగ్ గులాటిలు మాట్లాడారు. కార్యక్రమంలో నగరం నుంచే కాకుండా శివారు ప్రాంతాల నుంచి సుమారు 25 వేల మంది సిక్కు సోదరులు సోదరీమణులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఫ్యాప్సీ అధ్యక్షులు సురేశ్ కుమార్ సింఘాల్

## ఫ్యాప్సీలో హైపెక్స్-24 ప్రదర్శన షురూ..

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 15: ది హైదరాబాద్ ఫిలాటెలిక్ అండ్ హాబీస్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్ హిల్స్‌లో గల ఫ్యాప్సీ ఆడిటోరియంలో పురాతన అంశాలు, చరిత్ర, పూర్వీకుల జీవన శైలి తదితర అంశాలపై హైపెక్స్–2024 పేరుతో తపాలా స్టాంపులు, నాణేలు, కాగితపు కరెన్సీలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను ఫ్యాప్సీ అధ్యక్షులు సురేశ్ కుమార్ సింఘాల్ ప్రారంభించారు. నేటి తరానికి చరిత్ర పట్ల అవగాహనను కలిగించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి సాగి శ్రీనివాసరాజు మాట్లాడుతూ, 1962లో ప్రారంభమైన సొసైటీ రాజులు, నిజాంలు, కాకతీయుల పరిపాలన సమయంలో ప్రజలలో చెలామణిలో ఉన్న నాటి నాణేలు, స్టాంపులు తదితర వస్తువులను సేకరించి వాటి ప్రశస్తిని నేటి తరం పిల్లలకు తెలియజేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ ప్రదర్శనను మూడు రోజుల పాటు కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం నాగార్జున

## విద్యా రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున

మియాపూర్, నవంబరు 15: విద్యా రంగ సమస్యలను పరిష్కరించటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తద్వారా ఈ రంగం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నదని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు పురోగతి లేకుండా ఉన్నాయని, ఇదంతా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లేనన్నారు. ఏఐఎఫ్‌డీఎస్ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం ఎంఎ నగర్ ఎంసీపీఐయూ కార్యాలయంలో దినేశ్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, సీఎం వద్దే విద్యా శాఖ ఉన్నప్పటికీ విద్యా వ్యవస్థ కునారిల్లుతున్నదని, కనీసం పట్టింపు లేకపోవటంతో విద్యా రంగం తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నదన్నారు. పది నెలలుగా సీఎం విద్యాశాఖపై కనీసం ఒక్క సమీక్ష కూడా ఇప్పటి వరకు నిర్వహించలేదని నాగార్జున అన్నారు. అద్దెలు చెల్లించక భవనాలకు తాళాలు వేస్తున్నారని, స్కాలర్ షిప్‌ల విడుదల నిలిపివేత, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నా పట్టింపు లేదన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ జరిపించాలని, శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తూ ఆత్మహత్య చేసుకునేలా పరిస్థితులు దారి తీస్తున్నాయని నాగార్జున తెలిపారు. తక్షణమే విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేశ్, శ్రీకాంత్, రాజేంద్ర వంశీ, దినేశ్, వెంకటేశ్, జావీద్ పాల్గొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్‌గా శ్రీకాంత్‌ను ఈ సందర్భంగా ఎన్నుకున్నారు.

లీగల్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మాధవీ దేవి

## న్యాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

### హైకోర్టు న్యాయమూర్తి మాధవీ దేవి

హిమాయత్‌నగర్, నవంబర్ 15: సమాజంలోని ప్రతిపౌరుడు న్యాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మాధవీ దేవి అన్నారు. భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ లా కాలేజీ ఆవరణంలో లీగల్ ఎగ్జిబిషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఉన్న హక్కులు, బాధ్యతలను తెలుసుకున్నప్పుడే సమస్యలు ఎదురైన సమయంలో న్యాయ సేవలను సులభతరంగా పొందే అవకాశం ఉంటుందన్నారు. నూతనంగా వచ్చిన చట్టాలు, మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుని అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. నగరంలోని పలు లా కాలేజీల నుంచి విద్యార్థులు తరలివచ్చి ఎగ్జిబిషన్ వీక్షించారు. ఈ నెల17వ తేదీ వరకు జరిగే ఎగ్జిబిషన్‌లో భారత రాజ్యాంగ చరిత్ర, లీగల్ వ్యవహారాలు, కొత్త చట్టాలైన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్‌పై పూర్తి స్థాయిల్లో అవగాహన కల్గించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎల్.నరసింహా రెడ్డి, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, కో–ఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి, ఇన్‌చార్జి గోవింద్ పాల్గొన్నారు.

• పొంగిపొర్లుతున్న.. మ్యాన్‌హోల్స్

నగరంలో మ్యాన్‌హోళ్లు ఎక్కడికక్కడ పొంగిపొర్లుతున్నాయి. పంజాగుట్ట ప్రధాన రహదారి గురువారం మురుగునీటి వరద ముంపునకు గురైంది. హైదరాబాద్ సెంట్రల్ మాల్ నుంచి అర కిలోమీటరుకు పైగా నీటి ప్రవాహం కొనసాగింది. జల మండలి అధికారులు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఐదు గంటలు కష్టపడి నీటిని క్రమబద్ధీకరించారు. ఈ ఘటనను మరువక ముందే శుక్రవారం అమీర్‌పేట, పంజాగుట్ట ప్రధాన రహదారిపై మ్యాన్‌హోళ్ల నుంచి భారీగా మురుగునీరు రావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోలు, ద్విచక్రవాహనాల టైర్లు మునిగిపోవడంతో పాటు పాదచారులపై డ్రైనేజీ నీరు పడి అసహనం వ్యక్తం చేశారు. సోమాజిగూడ డివిజన్ పరిధిలోని అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో నాలాలను ఆక్రమించడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలలో వ్యర్థాలు పేరుకుపోయినా జల మండలి సిబ్బంది పట్టించుకోవడం లేదని, నాలాలను ఆక్రమించినా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నాలాల ఆక్రమణలు తొలగిస్తే సోమాజిగూడ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య తీరుతుందంటున్నారు. - ఖైరతాబాద్, నవంబర్ 15